



పోస్టుమాన్ ఇచ్చిపోయిన కవరుపై దస్తూరి చూసి, రామం దగ్గర నుండి అనుకుంటూ కుర్చీలో కూర్చున్నారు పరంధామయ్యగారు. కవరు చించి ఉత్తరం పైకి తీసి చదువుకున్నారు. ఆశ్చర్యంతో ఆయన కనుబొమలు ముడిపడ్డాయి. అర్థం కానట్టు మళ్లా మొదటినుండి చదివారు.

'లలితా' అంటూ భార్యని కేకేశారు. ఆ కేకలో పిర్పం, బాధ, కోపం అన్నీ మిళితమై ఉన్నాయి.

'ఏమండీ!' అంటూ తడిచేతులు కొంగుకు తుడుచుకుంటూ వచ్చారు లలితమ్మగారు.

"ఇదిగో అల్లుడు ఉత్తరం రాశాడు చూడు" అంటూ ఆ ఉత్తరం ఆమె చేతికి ఇచ్చారు. ఆత్రంగా ఉత్తరం చదివారు లలితమ్మగారు:

'ప్రియమైన మామయ్యకి,

నీ ఉత్తరం మొన్ననే అందింది. ముహూర్తం త్వరలో పెట్టాలని ఉందనీ, నా కెప్పుడు వీలవుతుందో వ్రాయమనీ వ్రాశావు. కాని నేనొక ముఖ్యమైన మాట చెప్పాలి. డొంకతిరుగుడుగా చెప్పేకన్నా, బన్నగా చెప్పటమే మంచిదన్న ఉద్దేశ్యంతో స్పష్టంగా వ్రాస్తున్నాను. నాకు శ్యామలను చేసుకోవటం ఇష్టంలేదు. నాకు తెలుసును. ఆనాడు నేను వివాహం చేసుకోవాలన్న ఉద్దేశ్యంతోనే నువ్వు నాకు ఇంజనీరింగు చెప్పించావు. అప్పుడు నాకు కూడా చేసుకుందామనే ఉండేది. కాని ఆలోచించి, ఇప్పుడు నా ఉద్దేశ్యం మార్చుకున్నాను. రేపో నేనో పెద్ద ఇంజనీర నైతే ఓ కుంటిదాన్ని నా భార్య అని ఎలా చెప్పుకోను? పాటివారిలో నాకు చిన్నతనంగా ఉండదా? కాని, నీవల్లనే నేను పైకి వచ్చానని మర్చిపోలేదు. మీ రెండో అమ్మాయి

52-వ పేజీ చూడండి

ప్రతివారం ఆంధ్ర దేశమంతటా లక్షలమంది ఆంధ్ర సచిత్ర వారపత్రికను చదివి ఆనందిస్తూ ఉంటారు. మీ స్థానిక ఏజెంటు ద్వారా చందాదారులయితే మీ కాపీ మీకు వారం వారం నిశ్చయంగా చేరగలదు.

ఆంధ్ర కర్ణాటక బోధిని

దీని సహాయమువల్ల ఆంధ్రులు కన్నడమును, కన్నడమువారు ఆంధ్రమును సులభముగా నేర్చుకొనవచ్చును.

వెల రు 1-50

దొరకు స్థలము:

సరస్వతీ బుక్ డిపో

తేరు బజారు, బళ్ళారి.

హింది సులభంగా ఎలా నేర్చుకోవడం?

హింది స్వయంశిక్ష

తరక ఎవుయాలల యువతియువకులు హిందీ ధారాళముగా మాట్లాడను, చదువను, వ్రాయను అత్యల్ప కాలంలో నేర్చుకొనుటకు సులభమైన పద్ధతిలో, తేలికైన భాషలో వివరించబడినది. వెల రు. 4-50 పోస్టుఖర్చు 0-85.

బి. వి. జగన్నాథ్ కంపెని,

3, మునియప్ప మొదలివీధి, మద్రాసు-1.

బర్క్లీ




10 సిగిరెట్లు
30 న.పై.

క్రమ్మని రుచి
ధారాళమైన పొగ

ప్రతి బర్క్లీ సిగిరెట్టు పెట్టెమీదవున్న నక్షత్రం మార్కు.
ఇది ప్రఖ్యాతమైన డబ్ల్యు. డి. & హెచ్. ఓ. విల్స్ వారి నాణ్యత కలిగివున్న వనటానికి గ్యారంటీ.

# కదులుకొన్న స్వర్గం

8—వ పేజీ తరువాయి

జయని పెళ్ళి చేసుకోవటానికి నా కేమీ అభ్యంతరం లేదు. మీకూ ఉండదనే అనుకుంటాను. ఈ విషయము అత్తయ్యతో చెప్పి, ఆలోచించి త్వరలో జవాబు వ్రాసేది. నన్ను అర్థం చేసుకోండి.

ఇట్లు
రామం.

తెల్లబోయారు లలితమ్మగారు. ఆమె కళ్ళనిండా నీళ్ళు తిరిగినయి. దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. కష్టంతో గొంతు పెగల్చుకుని 'ఇప్పు డెలాగండీ' అన్నారు.

పరంధామయ్యగారు కూడా ఉత్తరం వచ్చిందగ్గర నుండీ అదే ఆలోచిస్తున్నారు.

పరంధామయ్యగారు ఆ వూళ్ళో పేరున్న వకీలు. పెద్ద లిచ్చిపోయిన ఆస్తి ఏమీ లేకపోయినా ఆయన బాగానే ఆర్జిస్తున్నారు. ఆయనకి ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు. పెద్దది శ్యామల: సన్నగా, పొడుగ్గా ఉంటుంది. మొఖం గుండ్రంగా అందంగా ఉంటుంది. అమాయకత్వం ఉట్టిపడే కళ్ళు. ఆమెకు ఒక్కటే లోపం. ఒక కాలు కొంచెం కుంటి. చిన్నప్పు డొకసారి తల్లితో తాతగారి వూరు వెళ్ళినప్పుడు జోరుగా జ్వరం వచ్చి, ఆ జ్వరంలో నరం లాక్కుపోయి కాలు కుంటి ుయిపోయింది. పల్లెటూరవడం మూలాన సరైన వైద్య సహాయం లేకపోయిందనీ, లేకపోతే పిల్లకు ఆ అవకతనం వచ్చిఉండేది కాదనీ, ఇప్పటికీ ాపోటూ ఉంటారు తల్లీ, తండ్రీ.

రెండోది జయ: శ్యామలకన్నా రెండేళ్ళు చిన్నది. పుష్టిగా బలంగా ఉంటుంది. ఆమె ముఖంలో ఏదో ఆకర్షణ ఉంది. కన్ను, ముక్కు అంటూ చూస్తే ప్రత్యేకించి అందమైనది కాకపోయినా మొత్తంగా ఆకర్షణీయంగా, చూపరుల్ని ఆకట్టేట్లుగా ఉంటుంది. ఆమె కళ్ళు చురుకుతనంతో మెరుస్తూ ఉంటాయి; చలాకీ పిల్ల; మాటకారి.

తర్వాత వాడు అబ్బాయి దాసు; స్కూలు ఫైనలు చదువుతున్నాడు. నాల్గోది ఆడపిల్ల రాధ. థర్డుఫారం చదువుతోంది.

శ్యామలకి అవుడువల్ల పెళ్ళి కాదేమోనని చాలా బెంగపెట్టుకునేవారు తల్లీ, తండ్రీ. ఆయన చెల్లెలి కొడుకు ఈడైనవాడు ఉన్నా, కుంటిదాన్ని కోడలుగా తెచ్చుకోవటం ఇష్టంలేదు అని ఆమె సూచాయగా అన్నందువల్ల ఆ విషయం ఆయన అసలు కదపలేదు. ఆశ కూడా పెట్టుకోలేదు. కాని నాలుగు ఏళ్ళ క్రితం చెల్లెలు హఠాత్తుగా పోవడంతో, తండ్రిలేని మేనల్లుడి బాధ్యత పరంధామయ్యగారి మీద పడింది. అప్పుడే ఆయన మేనల్లుణ్ణి అడిగారు:

"ఒరే, నువ్వు మా శ్యామలను చేసుకోవడానికి ఇష్టపడేటట్టయితే ఇంజనీరింగు చదివిస్తాను. నాకు దాని విషయంలో చాలా బెంగగా ఉంది. అది అమాయకురాలు. దగ్గర సంబంధమైతే జాగ్రత్తగా దాని మనసు నొప్పించకుండా చూసుకుంటారని ఆశ. నీకైనా అది పరాయిది కాదు కదా. దానికి కాలు కొంచెం అవిటి అన్నమాటే కాని, మరేమీ తక్కువకాదు. ఏమంటావు' అని.

పరంధామయ్యగారు ఈ సూచన స్వార్థంతోనే

చేసినా, మసిపూసి మారేడుకాయ చేయకుండా మనసులో మాట సూటిగా చెప్పారు గనుక తన తప్పులేదు అని సరిపుచ్చుకున్నారు. రామం కూడా సంతోషంగా అంగీకరించాడు.

ఆ ఒప్పందంమీదే రామం ఇంజనీరింగులో చేరాడు. శ్యామల ఎన్నో ఆశలు పెంచుకుంది. ఎంత మంచివాడు బావ అని మురిసిపోయింది. వాళ్లేళ్లు గడిచిపోయి, రిజల్టు వచ్చింతర్వాత పెళ్లి విషయం సంప్రతిస్తూ పరంధామయ్య గారు వ్రాసిన లేఖకు జవాబు ఇది.

"ఇంత అన్యాయమా, కృతఘ్నుడు" అని పళ్లు కొరికారు పరంధామయ్యగారు. అంతలోనే తమా యించుకొని:

"ఈ సంగతి శ్యామలకి తెలియనివ్వకు అప్పుడే. మనం ఆలోచించుకొని, తర్వాత తాపీగా చెప్దాం" అన్నారు లలితమ్మగారితో.

ఆమె ఏదో అనబోతూ ఉండగానే కూతు ళ్ళిద్దరూ కాలేజీనుంచి రావడంతో ఆపేశారు.

ఆ రాత్రి లలితమ్మగారు భర్తతో తొందరపడి లాభంలేదని; శ్యామలను కాక, జయను వాడు చేసు కొనేట్టయితే జయను ఇచ్చి చేసేస్తేనే మంచిదనీ వాదించింది. ఇంత డబ్బు ఖర్చుపెట్టి పూర్కే పోని వ్వడం ఎందుకనీ, జయకైనా ఎలాగూ ఎవర్నో ఒకర్ని చూడాలి గనుక ఆమె నిచ్చి చేసేస్తే ఒక సమస్య తీరిపోతుంది కదా; ఇక శ్యామలకా, గంతకు తగ్గ బొంత అని ఎవరో ఒకరు దొరక్కపోరు. కాకుంటే, ఇంతమంచి సంబంధం కాకపోవచ్చు; కాస్త కట్నం ఎక్కువ ఇస్తామంటే ఎవరో ఒకరు చేసుకుంటారనీ ఆమె ఉద్దేశ్యం. మొదట అలా వీల్లేదని వాదించినా, చివరకు ఒప్పుకున్నారు పరం ధామయ్యగారు కూడా.

మర్నాడు శ్యామల్ని పిల్చి ఉత్తరం చేతిలో పెట్టారు పరంధామయ్యగారు. ఆమె అది చదివి, ఏం మాట్లాడకుండా, దాన్ని అక్కడే పడేసి వెళ్లి పోయింది; మరో రెండు నిమిషాలకే.

"అక్క ఏడుస్తోంది ఎందుకే అమ్మా" అంటూ వచ్చింది జయ.

ఆ ఉత్తరం తీసి జయ చేతిలో పెట్టింది తల్లి. అది చదివిన జయ మొఖం కోపంతో ఎరు పెక్కింది.

"సిగ్గు లేకపోతే సరి; ఈ బుద్ధి ముందు లేదు కాబోలు. జయని చేసుకుంటాడట జయని; ఇక్కడ ఎవరో సిద్ధంగా ఉన్నట్టు. వచ్చినా సరే నేను మాత్రం అతన్ని చేసుకోను" అంది ఖచ్చితంగా.

'అది కాదమ్మా' అంటూ ఏదో చెప్పబోయిన పరంధామయ్యగార్ని మధ్యలోనే ఆపేస్తూ:

"ఏది కాదు నాన్నా. అక్కని చేసుకుంటానన్న పెద్దమనిషి ఇప్పు డిలా మాట తప్పుతున్నా డెందుకు ? అక్క కాలు కుంటి అని ఇవాళే తెలి సిందా ? ఇంజనీరింగు పూర్తి అయిందాకా ఊరు కుని ఇప్పుడు చెప్తాడా ఆ మాట ! పైగా స్పష్ట ముగా చెప్తున్నాడట! ఎంత ధైర్యంతో అన్నాడా మాట! డబ్బు పెట్టాం కనుక తన మాటకు ఎలా అయినా ఒప్పుకుంటాం అని ధీమా. అక్కని కాదన్న మనిషిని నేను చేసుకోను. ఓ తల్లీ తండ్రీ లేని వాడికి విద్యాదానం చేశా మనుకుని ఊరు కోండి. నేను మాత్రం అరు మారయినా ఈ సంబంధానికి ఒప్పుకోను. మనిషి అందచందాలకే కాని, మనస్సుకి, వ్యక్తిత్వానికి విలువ ఇవ్వలేని మని షిని నేను గౌరవించలేను ! గౌరవించలేని మనిషిని వివాహం చేసుకోలేను." అని చెప్పేసి వెళ్లి పోయింది.

లలితమ్మగారు, పరంధామయ్యగారు మొఖా మొఖాలు చూసుకున్నారు.

జయ ఒక నిశ్చయానికి వస్తే, దాన్ని మార్చే శక్తి ఎవరికీ లేదని వాళ్లకు బాగా తెలుసు. శ్యామల, జయ—ఇద్దరూ వారి బిడ్డలే అయినా ఇద్దరికీ ఎంతో వ్యత్యాసముంది.

శ్యామల అమాయకురాలు. తను బాధపడడాని కైనా ఒప్పుకుంటుంది గాని, ఒకరిని నొప్పించదు. నెమ్మదైనది. కోపం మచ్చుకైనా లేదు. ఎలాంటి తప్పునైనా క్షమించగల దామె.

జయకి కోపం, ఆత్మాభిమానం, పట్టుదల, గడుసుతనం అన్నీ—ఒకో్కపాలు ఎక్కువే. ఆమెకు కొన్ని స్వతంత్ర అభిప్రాయాలు, ఆదర్శాలు ఉన్నాయి. అలాంటి అభిప్రాయాలున్నవాళ్లనే ఆమె గౌరవిస్తుంది.

అక్కచెల్లెళ్లిద్దరికీ ఒకరంటే ఒకరికి ఎంతో ప్రేమ, అభిమానం.

చిన్నప్పుడు ఆటల్లో తోటి పిల్లలు శ్యామలని 'సొట్ట కాలు, కుంటి కొంగ' అని ఉడికిస్తే ఆమె ఏమీ అనేదికాదు. ఏడుస్తూ అమ్మ దగ్గిరికి వెళ్లి పోయేది. కాని జయ మాత్రం 'మా అక్క నేమన్నా అంటే జాగ్రత్త' అంటూ వాళ్లతో పోట్లాటకు వెళ్ళేది.

ఆమె పట్టుదలవల్లే ఇంటరు ప్యాసై, ఇంట్లో కూర్చున్న శ్యామల ఆమెతోపాటు బి. ఏ. లో చేరింది.

ఆమె నిశ్చయాన్ని విన్న పరంధామయ్యగారు ఆమె మాటల్లోని సబబును గుర్తించారు. ఆమె అభిమానానికి అబ్బురపడ్డారు. ఆయన హృదయం వాత్సల్యంతో నిండిపోయింది. చిన్నదయినా తమ చేయబోయిన తప్పును దిద్దిందని సంతోషించారు.

'అవును. అది చెప్పింది నిజమే. మనమే డబ్బు కోసం అని కక్కుర్తి పడబోయాం. నయమే. పొరపాటు చెయ్యలేదు. వాడికి ఇవాళే రాసేస్తాను. ఇక చదువు చెప్పించామా అంటే వాడు నా చెల్లెలి కొడుకేగదా. నా బాధ్యత నేను నెరవేర్చాను గాని ఎక్కువేమీ చెయ్యలేదు. వాడి మాట వాడికే ఉంటుంది." అంటూ కలం, కాగితం తీసుకున్నారు. లలితమ్మగారు ఏమీ అనలేదు. కూతురి మాటే సబబు అని అంతరాత్మ చెబుతున్నా, అయ్యో! అంత డబ్బూ ఊరికే పోయిందే అనే బాధ వదల్లే దామెను.

* * *

రామం పరంధామయ్యగారి ఉత్తరం చూసి అట్టే ఆశ్చర్యపడలేదు. అతనికి జయ సంగతి కొంచెం తెలుసును కనుక అలాంటి ఉత్తరం వస్తుందేమోనని అనుమానిస్తూనే ఉన్నాడు. అయితే దీనికి ఏం చేయాలో ఆలోచించుకునే ఉన్నాడు కనుక వెంటనే జయ పేర ఉత్తరం వ్రాశాడు:

"ప్రియమైన జయకి,

మామయ్య వ్రాసిన ఉత్తరం ఇవాళే అందింది. నీవు నాతో వివాహానికి అంగీకరించటంలేదని వ్రాశాడు. జయా ! బాగా ఆలోచించుకున్నావా ? మీ అక్కను చేసుకోనన్నానన్న కోపంతో మంచి చెడ్డలు ఆలోచించుకోవటం మానేశావా ? వాక్కు


## శ్రీబాలాంజనేయ ప్రశ్న

సంతానము, రోగములు, గృహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలించిన సొమ్ము, వీడిపోయిన భార్య మీరు కోరిన 5 ప్రశ్నలకు వెంటనే వ్రాసి పంపగలను. రూ. 2 ఎం.ఒ. చేయండి. నెలల వారీగా 12 నెలలకు 1 సం॥రం జాతకం రూ 2. పూర్తి పేరు,జాబు వ్రాసినవేళ్ల మాత్రమే తెలిపినచాలును

**హనుమాన్ జ్యోతిషాలయము,**

10వ లైను, అరండల్ పేట, గుంటూరు-2.

## RATNAM'S N-OIL
(పై పూతకు మాత్రమే)

అంగ నరములు బలహీనత చెంది, చిన్నదైనచో తిరిగి యథాప్రకారం అయి పూర్తి సౌఖ్య మనుభవించుటకు 50 సం॥ ప్రఖ్యాతి గలది. 1 సీసా రూ. 10/-లు. వి.పి. 1-4-0. కావలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇందులో స్పెషల్ రకం అర్జంటు గుణ మునకు రూ. 25-0-0 లు.

**డాక్టర్ రత్నం సన్స్, (Estd 1904)**

మలకపేట బిల్డింగ్స్, ఆజంపూరా మార్కెట్‌వద్ద, హైదరాబాద్-24 (ఆంధ్రప్రదేశ్)




త్వరితంగా నివారించ బడినది




పెప్స్
గొంతు మరియు
గుండె బిళ్లలు
మందుల వ్యాపారు
లందరి వద్దనూ
దొరకును

వి. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి

FPY-56-TEL

సోల్ ఏజంట్లు: దాదా & కం

86, నైనప్పనాయకన్ వీధి, మద్రాసు—3

# ఆయుధాల కొరకు ఆభరణాలను ఇవ్వండి

**సచిత్ర ట్రాన్సిస్టర్ రేడియో గైడ్**

ఎలెక్ట్రిసిటి లేకుండ రు.30/–కు స్వంత పోర్టబుల్, ప్యాకెట్ మాచ్‌బాక్స్, టేబుల్ మోడల్ ట్రాన్సిస్టర్ రేడియో తయారీకి లేక మరమ్మతుకుపూర్తి సచిత్ర గైడ్.ధరరు.4/-.250ఎంబ్రాయిడరిడిజైన్లపుస్తకం రు.5/–డ్రాయింగ్ & పెయింటింగ్ గైడ్‌రు5/– వివాహ జీవితం 100 చిత్రపటములుగల పుస్తకం రు. 5/– టైలరింగ్ & కటింగు గైడ్ రు. 4/– ఫొటోగ్రఫీ రు. 3/– ఒక్కొక్క పుస్తకమునకు పోస్టేజి రు. 1/– అదనం.

Ilfa Book Depot (APV)
Rafatganj, Aligarh (U.P.)

**శ్రీదేవి కల్పం**

30 సం. అనుభవం. దురదలు, పొక్కులు, మంట, పగుళ్లు,నల్లరంగు పొడలు,గజచర్మం,తిమురులు, దద్దులు, పొడిచినప్పుడు నొప్పిలేకుండుట,ఎఱ్ఱ పొడలు, గ్రంధి, సూలం, బగందరం మొదలగు మహా వ్యాధులకు నివారిణి. 40 రోజులు కల్పం రు. 15/– V. P. ఖర్చు ప్రత్యేకం.

డా॥ K.A. గోవిందస్వామి,R.M.P.
67, పిరంబాలుశెట్టి వీధి,మద్రాసు-21.

# నాణ్యత మరియు పొదుపు కుటుంబం అంతటికి




# కాల్గేట్
బహుళవిధోపయోగ టాల్కు

అపురూపమైన పువ్వుల శాశ్వత సువాసనగలది!


## పదుల. కొన్న స్వర్గం

ఏం తక్కువ అని పద్దంటున్నావు. 'ఇంజనీరుగారి భార్య' అంటే ఎంత హోదా ? గౌరవం ? మంచి ఇల్లు, కారు, నౌకర్లు చాకర్లు, దర్జా. నువ్వింకా చిన్నదానివే. డబ్బు విలువ, హోదా విలువ నీకింకా బాగా తెలీదు. జాగ్రత్తగా మరోసారి ఆలోచించు. కులటదాన్ని చేసుకొని నా జీవితం పాడుచేసుకోవటానికి నిరాకరించటం తప్పా ?

నువ్వు కాదంటే నా కింకో సంబంధం దొరక్క పోదు. వేలకు వేలు కట్నం ఇచ్చి పిల్లనిచ్చేవాళ్లు ఎందరో ఉన్నారు. మళ్లీ మళ్లీ చెప్తున్నానంటే నాకు నువ్వంటే ఉన్న ప్రేమ, మామయ్య అంటే ఉన్న అభిమానమే కారణాలు.

నా మాట కాదనవనీ, నీ ఉద్దేశం మార్చుకుంటావనీ ఆశిస్తూ, నీ

బావ."

దీని కిక తిరుగు లేదనీ, జయ తప్పక వప్పుకుంటుందనీ అనుకున్నాడు రామం. తిరుగు టపాలో వచ్చింది జవాబు

శ్రీ రామంగారికి,

మీ ఉత్తరం అందింది. సమాధానంగా ఎక్కువేమీ వ్రాయ నక్కరలేదు. మీకు అన్నీ ఉన్నా, మాట నిలకడ లేదు; హృదయం లేదు. ఇంకేమీ లేకుండా ఆ రెండే ఉన్న వ్యక్తినైనా చేసుకుంటాను గాని, అన్నీ ఉండి అవి మాత్రం లేని మనిషిని నేను చేసుకోను. దర్జా, హోదాలతో నాకు పనిలేదు. ఇంకెవరయినా మిమ్మల్ని చేసుకోవటాని కంగీకరిస్తే నిరభ్యంతరంగా చేసుకోండి. మళ్లీ మళ్లీ వ్రాసి నన్ను విసిగించవద్దు. నా నిర్ణయం మారదు.

ఇట్లు,
జయలక్ష్మి.

ఉత్తరం చదివి మండిపడ్డాడు రామం. "దీనికన్నా నాకు గతిలేదనుకుందా ? ఇంకెవరూ దొరకరనుకుందా ? నీతులు చెప్తోంది ! నీతులు ! పోనీకదా అని మరోసారి అడిగితే విసిగెత్తించవద్దట. సరే, నేనూ చూస్తా ఎవణ్ణి చేసుకుంటుందో" అనుకున్నాడు.

శ్యామల జయతో చాలా చెప్పి చూసింది పెళ్లికి వప్పుకోమనీ, అనవసరంగా చక్కటి అవకాశాన్ని జారవిడుచుకోవద్దనీ. అన్నిటికీ జయది ఒకటే జవాబు. "నీ బదులు నన్ను తిరస్కరించి, నన్ను చేసుకుంటానంటే వప్పుకుందువా ? మనస్కరించని పని నన్నెందుకు చేయమంటావు ?"

* * *

రామం పెళ్లి అయిపోయింది. ఎవరో ఆరువేలు కట్నం ఇచ్చి పిల్లనిచ్చి ఘనంగా పెళ్లి చేశారు. ఎవరూ వెళ్లకపోతే బాగుండదని పరంధామయ్యగారు వెళ్లి వచ్చారు. కాని రామం ఆయన్ని పలకరించను కూడా లేదు.

శ్యామల బి. ఏ. ప్యాసయి బి. ఇడి చదువుతానని అంటే సరేనని రాజమండ్రిలో ఉన్న పిన్నిగారి ఇంటివద్ద ఉండి చదువుకునే ఏర్పాటు చేశారు పరంధామయ్యగారు. జయను కూడా చదవమంటే చిన్నపిల్లలకి చదువుచెప్పే వోపిక తనకు లేదంటూ, తమ వూళ్లోనే ఏదో ఆఫీసులో క్లర్కుగా చేరింది ఉబుసుపోకకి అంటూ.

పదేళ్ళు గడిచాయి. శ్యామల బి. ఇడి అయి విశాఖపట్నంలో టీచరుగా చేరింది. అదే ఊళ్ళో ఇంటి కెదురింట్లోని కాలేజీ లెక్చరరుగారితో పరిచయం అవటం, వారిరువురూ పరస్పరం ప్రేమించుకుని తల్లిదండ్రుల ఆశీస్సులతో వివాహం చేసుకోవటం జరిగాయి. ఆమెకి ఇద్దరు పిల్లలు.

జయ అక్కదగ్గిర ఉండి ఎం. ఏ. చదువుకొని ఒక డాక్టర్ని పెళ్ళి చేసుకుంది. అతను అబ్రాహ్మణుడని ముందు వరంధామయ్యగారు అయిష్టత కనపర్చినా, జయ పట్టుదల తెలిసినవాళ్లవటంవల్ల మాట పోగొట్టుకోవటంకన్నా మర్యాదగా ఒప్పుకోవటమే మంచిదనుకున్నారు. పైగా కులం వాడు కాదు: అదే పదివేలు అనుకున్నారు లలితమ్మగారు.

జయ విశాఖపట్నంలోనే ఉంటూ యూనివర్శిటీలో ట్యూటరుగా చేరింది.

రామం నుండి ఉత్తరాలు ఏమీ లేవు. అతని సమాచారం కూడా సరిగా ఏమీ తెలియలేదు.

* * *

వాల్తేరు స్టేషనులో దిగి గేటుదగ్గర టికెట్టు ఇస్తున్న రామానికి "బావా ?" అని పరిచితమైన పిలుపు వినబడింది. వెనక్కు తిరిగి చూశాడు. శ్యామల. మునుపటికన్నా కొద్దిగా లావయింది తప్ప ఇంకేమీ మార్పు లేదు. ఆమె ముఖంలో అమాయకత్వంతోపాటు తృప్తి, సంతోషం కనిపిస్తున్నాయి. ఏమీ మాట్లాడలేక నిల్చున్నాడు రామం. వాల్తేరు కేంపు అనుకోగానే భయపడ్డాడు శ్యామలనేనా, జయనేనా చూడాలేమోనని. వాళ్ళు అక్కడ ఉన్నట్టు స్నేహితుడి ద్వారా తెలుసుకున్నాడతను. అయినా వాళ్ల యింటికి వెళ్లకపోతే వాళ్లెందుకు కనిపిస్తారులే అని సరిపుచ్చుకున్నాడు. కాని ఊళ్లో అడుగుపెట్టగనే శ్యామల ఎదురవుతుం దనుకోలేదు.

"ఏం, బావా, మరిచిపోయావా? నేను శ్యామలను" అంది శ్యామల చిరునవ్వుతో.

"ఆఁ !, లేదు, లేదు" అంటూ ముందుకు నడిచాడు.

"ముందు ఇంటికి పద బావా, తర్వాత మాట్లాడుకొందాం" అంటూ రిక్షాని పిలిచింది.

"ఎందుకులే శ్యామా, నేను హొటలుకు పోతాను. మీ యింటికి తరువాత వస్తాను. అడ్రసు ఇయ్యి" అంటున్న రామాన్ని,

"అదేమిటి బావా, మేం ఇక్కడుండగా హొటలు ఖర్మ యేమిటి. పద పద" అంటూ తనో రిక్షా ఎక్కి అతని సామాను ఇంకో రిక్షాలో పెట్టించింది.

రిక్షాలో కూర్చున్న రామం మనసు పరిపరి విధాల పోతోంది. తను చేసిన అన్యాయాన్ని మర్చిపోయి ఎలా క్షమించగల్గింది శ్యామల? ఏమీ జరగనట్టే ప్రవర్తిస్తోందే? స్టేషనుకు ఎందుకు వచ్చింది! ఆమెను చేసుకున్నతను ఎవరు? ఎలా ఉంటాడు" అని ఆలోచిస్తున్నాడు.

రిక్షా డాబా గార్డెన్సులో ఓ చిన్న ఇంటిముందు ఆగింది. ముందర చిన్న పూలతోట. దాన్నిండా శ్యామల కిష్టమయిన చామంతులు నిరగపూసి ఉన్నాయి. చిన్న ఇల్లయినా చక్కగా ఉంది.

"సామాను లోపలికి తేవోయి! రా బావా" అన్న శ్యామల పిలుపుతో లోకంలో పడ్డాడు రామం.

పనిమనిషి తలుపు తీసింది. ముందు గదిలో నాల్గు కుర్చీలు ఒక టేబిలు, పుస్తకాల రాక్ ఉన్నాయి. ఓమూల బల్లమీద రేడియో ఉంది. దానిమీద పిల్లల ఫోటోలు ఉన్నాయి. టేబిలుమీద వాజులో పువ్వులు అందంగా అమర్చబడి ఉన్నాయి. ద్వారాలకి చక్కని కర్టెన్లు వేసి ఉన్నాయి.

వెనక గదిలోంచి ఓ రెండేళ్ళ పాప, నాల్గేళ్లబ్బాయి, "అమ్మా, మరేమో" అంటూ వచ్చారు. కొత్త మనిషిని చూసి చెప్పేది సగంలోనే ఆపేశారు. పిల్లలు బొద్దుగా, అందంగా, శుభ్రమైన బట్టలు తొడుక్కుని ముద్దుగొస్తూ ఉన్నారు.

"వీళ్ళు మా పిల్లలు బావా" అని చెప్తూ, "బాబా యిది నమస్తే చెప్పండి బాబూ" అంది. రామంపక్క వింతగా చూస్తూ "నమస్తే" అన్నాడు బాబు. వచ్చీ రాని మాటలతో అన్నని అనుకరిస్తూ "నమత్తే" అంది పాప. "మీరెళ్లి ఆడుకోండమ్మా" అంటూ పిల్లల్ని పంపించేసింది శ్యామల.

"అయితే మేం ఇక్కడ ఉన్నామని నీకు తెలియదా బావా" అని అడిగింది.

"ఆహాఁ ! తెలిదు" అని అబద్ధం ఆడాడు రామం.

---

డైరెక్టర్ : అమ్మాయ్! ఇప్పుడు ఏం చెయ్యాలో తెలుసా? ఆ బోనులోనుంచి సింహాన్ని వదులుతారు. అది వస్తూంటే నువ్వు పరిగెత్తాలన్న మాట. తెలిసిందా?

హీరోయిన్ : నాకు తెలిసిందండీ! ఆ సింహానికి తెలిసేలా చెప్పండి.

కె. రంగారావు

---

"నయమే. మా ఆడబడుచుని దిగబెట్టడానికి నేను స్టేషనుకు వచ్చాను గనుక సరిపోయింది. లేకపోతే నిన్ను చూడకనే పోయివుందును."

ఆతరువాత కాస్సేపు అవీ ఇవీ చెప్పింది శ్యామల. వరంధామయ్యగార్కి ఆమధ్య జబ్బుచేసి తగ్గిందని, జయకి మూడోనెల అనీ ఇంకా ఏమేమో చెప్పింది. అన్నిటికీ ఊఁ కొట్టటం తప్ప ఇంకేమీ మాట్లాడలేదు రామం.

"స్నానం చెయ్యి బావా. ఆయన వచ్చేవేళయింది. భోంచేసి కాసేపు పడుకుందువుగాని" అంటూ లోపలి కెళ్ళింది.

రామం లేచి తన సామాను ఉన్న పక్క గదిలోకి వెళ్లాడు. ఆ గది కూడా చాలా చక్కగా సర్దబడి ఉంది. ఎక్కడి వస్తువు అక్కడ అందంగా అమర్చబడి ఉన్నాయి. ఇల్లంటే ఇలా ఉండాలి అనుకున్నాడు రామం అప్రయత్నంగా. తన ఇల్లు జ్ఞప్తికి వచ్చింది. చిందరవందరగా ఓ అడవిలా ఉంటుంది. తన భార్య కళ్యాణికి ఇల్లు సర్దే ఓపిక లేదు సరికదా పనివాళ్లతో చెప్పి చేయించే శ్రద్ధ కూడా లేదు. ఎంతసేపూ ఏ డిటెక్టివ్ నవలో పట్టుకు దొర్లుతూ ఉంటుంది. లేకపోతే ఇరుగమ్మతోను, పొరుగమ్మతోనూ పోచుకోలు కబుర్లు చెప్తూ కాలక్షేపం చేస్తుంది. పిల్లలు కూడా తల్లికి తగ్గవాళ్లే. చింపిరిగా, జిడ్డోడుతూ ఉంటారు. వాళ్లను కాస్త శుభ్రంగా ఉంచరాదూ, ఇంజనీరుగారి పిల్లలంటే చిన్నతనం కూడా అని తనంటే "నా కంతకన్నా చేతకాదు, కావలిస్తే మీరు ముస్తాబు చేసుకోండి అంటుంది." ఇంకా ఏమన్నా అనబోతే "ఈ సాధింపులు నేను పడలేను, మిమ్మల్ని ఆరువేలు యిచ్చి కొనుక్కున్నది ఈ సాధింపులు పడ్డానికి కాదు" అంటుంది గర్వంగా. ఏమంటాడు తను. తన యిల్లో నరకం.

స్నానం చేస్తుండగా వీళ్ల గదిలోనికి మాటలు వినిపించాయి.

"చెల్లాయి వెళ్ళిపోయిందా శ్యామూ ?" శ్యామల భర్త కాబోలు అనుకున్నాడు రామం.

"ఆ ! రైల్లో బాగానే జాగా దొరికింది. చేరగానే ఉత్తరం రాయమని చెప్పాను. అన్నట్టు మన యింటి కెవరో వచ్చారు, ఎవరో చెప్పుకోండి చూదాం."

"ఎవరూ ?" అన్నాడు శర్మ.

"మా రామం బావ."

"అంటే .... ఆ ఇంజనీరు కదూ ? నిన్ను ...." అంటూంటే "ఇశ్ గట్టిగా అనకండి, వినపడితే బాగుండదు" అంటూ వారించింది.

అయితే అతనికి అంతా తెలుసునన్నమాట. అనుకున్నాడు రామం.

స్నానంచేసి ఇవతలికి వచ్చిన రామాన్ని భర్తకి పరిచయం చేసింది. శర్మ ఒడ్డుగా పొడుగ్గా, అందంగా ఉన్నాడు. నవ్వుముఖంతో పలకరించి చనువుగా మాట్లాడాడు.

భోంచేసి కాలేజీకి వెళ్ళిపోయాడు శర్మ. రామాన్ని కాసేపు పడుకోమని పక్క వేసింది శ్యామల.

నాలుగు గంటలకి మెలకువ వచ్చింది. బద్ధకం తీర్చుకుంటూ పడుకున్న అతనికి శర్మగొంతు వినపడింది.

"శ్యామూ, ఇదో నీకోసం ఏం తెచ్చానో చూడు" అంటున్నాడు.

"ఏం తెచ్చారు" అన్న శ్యామల గొంతు. రెండు నిమిషాల నిశ్శబ్దం తరువాత 'సంపెంగపూలు ఎక్కడివి' అంది. ఆమె గొంతులో ఎంతో సంతోషం ధ్వనించింది.

సంపెంగి పువ్వులా, తను బంగారు నెక్లెసు తెచ్చి ఇచ్చిన రోజు కూడా కళ్యాణి గొంతులో ఆ సంతోషం లేదు. "ఇదా ! నప్పడక్కుండా ఎందుకు తెచ్చారు. నేనైతే ఇంకా మంచిది సెలక్టు చేసుకుందును. ఎవరిక్కావాలి ఇది" అని రుసరుస లాడుతూ వెళ్లిపోయింది. మళ్లీ తను చేతులో ఏమీ తేలేదు కళ్యాణి కోసం.

లేచి హాల్లోకి వెళ్లాడు. శ్యామల స్నానంచేసి చీర మార్చుకున్నట్టుంది. కళ కళ లాడుతున్నది. ఆమె తల్లోని సంపెంగపువ్వులు సువాసనలు వెదజల్లుతున్నాయి. శర్మ, ఒళ్ళంత కళ్ళు చేసుకుని, ఎంతో ప్రేమగా ఆమెవేపు చూస్తున్నాడు. ఆమె కదలిన వేపల్లా కదుల్తున్నాయి అతని కళ్ళు.

ఆమెలో లోపం ఉన్నట్లు అతనికి గుర్తు లేనట్లుంది.

అదృష్టవంతులు, అనుకూలమైన దంపతులు అనుకున్నాడు రామం.

శ్యామల ప్లేట్లో మైసూరుపాకు, ఉల్లిపాయ పకోడీలు, కప్పుతో కాఫీ తెచ్చి బల్లమీద పెట్టింది.

"ఇన్నిదినాలయినా తన ఇష్టాయిష్టాలు గుర్తు ఉన్నాయన్నమాట. తనవే ఇంత ఇదిగా చూస్తూవుంటే ఇంక హృదయమిచ్చి పుచ్చుకున్న శర్మ నెంత సుఖపెడుతూందో" అనుకున్నాడు రామం.

'నువ్వూ సుఖపడుదువు, అన్నమాటమీద నిలబడి, తెలివితక్కువ ఆలోచనలతో ఆమెను అన్యాయము చేయకుండా ఉండిఉంటే' అని ఎవరో

## వదులుకొన్న స్వర్గం

వెన్ను చరిచి చెప్పినట్టయింది.

మరి కాసేపటికి జయ వచ్చింది.

కడుపుతో ఉందేమో మునుపటికన్నా అందంగా ఉంది.

వస్తూనే "హాహా ఇంజనీరుగారు కులాసానా ? మీ శ్రీమతిని తీసుకువచ్చారా" అంటూ పలకరించింది. ఆమె గొంతులో వ్యంగ్యం స్పష్టంగా తెలుస్తోంది.

"లేదు, జయా, తీసుకురాలేదు" అన్నాడు.

"ఏం, మాకు చూపించితే ఆమె అందం తగ్గిపోతుందా" అంది జయ.

"జయా !" అని గదిమింది శ్యామల.

"మీ ఆవిడ చక్కగా ఉంటుందా, చదువుకుందా" అంటూ మళ్ళీ జయే ప్రశ్నల వర్షం కురిపించింది.

"దాన్ని గురించి అడగకు జయా, అదో రాక్షసి, ఆ యిల్లో నరకం" అన్నాడు రామం బాధగా.

"అవును, చేతులారా స్వర్గం వదులుకున్న వాళ్ళకు నరకం దొరక్క ఏమవుతుంది" అంది జయ నవ్వుతూ.

తల వంచుకున్న రామాన్ని జాలిగ చూశారు శర్మ, శ్యామల. ★


## గులాబీ పూల వర్షం

ఒక పౌను గులాబీల నూనె తయారు చేయుటకు సుమారు 4000 పౌనుల గులాబీ పువ్వులు కావాలి....కాని మనోల్లాస కరమైన గులాబీ పూల వర్షము వలె హాయి గొలుపుటకు మీకు కావలసిందల్లా ఒక గోద్రెజ్ నం. 1. సబ్బు బిళ్ళ. గులాబీల మనోహరమైన కమ్మని పరిమళము దివ్యముగా తిరిగి వశ పర్చుకోబడి సబ్బులలో రాజా యనదగు ఈ సబ్బు యందు యంత్ర మూలమున ఇమడ్చ బడినది.

నూతన పరిశోధనలు, పద్ధతులున్ను, ఆధునిక యంత్రములు మరియు సంవత్సరాల తరబడిగా పొందిన అధికానుభవమున్ను, ఇతర గోద్రెజ్ సబ్బులతో పాటు ఈ మొదటి కూరగాయల నూనె టాయిలెట్ సబ్బు యందలి సాంప్రదాయంగా పరిశుభ్రపర్చునట్టిన్ని మార్దవకర మైనట్టిన్ని పదార్థములను ఇంకా ఎక్కువగా వృద్ధిపొందింపజేసినవి.






గోద్రెజ్
నం. 1. టాయిలెట్ సబ్బు
పెద్ద — సైజు

అతి శ్రేష్ఠమైనది మరియు స్వదేశీ

గోద్రెజ్ సబ్బులకు అత్యుత్తమ నామచిహ్నము



Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra PatrikaPress 6 & 7, Thambuchetty Stree, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.